క్లుప్తంగా

తురకపాలెంలో పర్యటించిన ప్రజాసంఘాలు



గుంటూరు రూరల్: తురకపాలెం గ్రామంలో వరుస మరణాలు సంభవిస్తున్న నేపథ్యంలో మంగళవారం పలు దళిత, ప్రజా సంఘాలు, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా ప్రతినిధులు గ్రామంలోని బాధిత కుటుంబాలను పరామర్శించారు. సంఘటన జరిగిన తీరును బాధిత కుటుంబాల నుంచి అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో తాగునీటితో మొదలైన సమస్య పదుల సంఖ్యలో మరణాలకు దారితీసిందని, గ్రామంలో పారిశుద్ధ్యం పడకేసిందని గ్రామస్తులు సంఘాల నాయకులకు తెలిపారు. వైద్య సేవలు అంతంతమాత్రంగా ఉండటంతో అనారోగ్యాలతో ప్రజలు మృత్యువాతకు గురయ్యారని వాపోయారు. ఇంటి పెద్దదిక్కులను కోల్పోయి అప్పులపాలయ్యామని బాధిత కుటుంబాలను ఆదుకుని న్యాయం చేయాలని ప్రజలు కోరారు. అందుకు స్పందించిన సంఘాల నాయకులు బాధిత కుటుంబాలకు న్యాయం జరిగే వరకూ పోరాటం చేస్తామని బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామని తెలిపారు.

సీజేఐపై దాడి యత్నం గర్హనీయం



పొన్నూరు: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్. బి.ఆర్.గవాయిపై జరిగిన దాడి యత్నం భారత రాజ్యాంగం, దేశ గౌరవం, న్యాయ వ్యవస్థలపై జరిగిన దాడితో సమానమని రాష్ట్ర పౌర హక్కుల సంఘం కోశాధికారి డాక్టర్ టి. రాజారావు అన్నారు. మంగళవారం పట్టణంలోని న్యాయవాదుల కార్యాలయంలో సమావేశంలో సీజేఐపై జరిగిన దాడిని ఖండించారు. రాజారావు మాట్లాడుతూ సీజేఐ పై దాడి యత్నం ఆవేశ పూరిత చర్య కాదని అన్నారు. దాడి వెనుక ఉన్న కుట్ర కోణాన్ని స్వతంత్ర దర్యాప్తు సంస్థతో దర్యాప్తు జరిపించి భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మానవ హక్కుల వేదిక జి.ఎస్. రాయల్, కుల నిర్మూలన పోరాట సమితి తోడేటి శ్రీనివాస్, షేక్. సుభాని, న్యాయవాదులు శ్యాంసుందర్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

ఎంఈవో సీహెచ్. రమాదేవి



ప్రత్తిపాడు: విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలని మండల విద్యాశాఖాధికారి సీహెచ్. రమాదేవి అన్నారు. నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులోని భవనం వెంకటరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-14, అండర్-17 బాలుర, బాలికల విభాగాల్లో మండల స్థాయి క్రీడాకారుల ఎంపికలు జరిగాయి. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు షేక్ అలీషా తొలుత క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలను ప్రారంభించారు. ఆయా పాఠశాలలకు చెందిన విద్యార్థులు కబడ్డీ, కోకో, వాలీబాల్, యోగ, అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, చదరంగం, పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను చాటారు. ఆయా విభాగాల్లో సత్తా చాటిన బాల, బాలికలను డివిజన్ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. పోటీలను ప్రత్తిపాడు మండలం స్కూల్ గేమ్స్ కోఆర్డినేటర్ షేక్ కరీముల్లా పర్యవేక్షించారు. ఎంఈవో రమాదేవి మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసం లభిస్తుందన్నారు. ఎంఈవో-2 లీలారాణి మాట్లాడుతూ క్రీడల్లో గెలుపోములు ముఖ్యం కాదని, పోటీతత్వం అవసరమన్నారు. పేరెంట్స్ కమిటీ చైర్మన్ అబ్దుల్ రవూఫ్, పీడీలు రవికుమార్, ఫిలిప్స్, గంగాధర్, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

చేబ్రోలులో ఎడ్యుకేషన్ డైరెక్టర్ తనిఖీలు



చేబ్రోలు: విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించటానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బోర్డు ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ సెక్రటరీ నారాయణ భరత్ గుప్తా అన్నారు. మండల కేంద్రమైన చేబ్రోలులోని సూర్యదేవర నరసయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలను మంగళవారం ఇంటర్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నారాయణ భరత్ గుప్తా అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులతో మాట్లాడారు. కళాశాలలోని వసతులు, పరీక్షా విధానం, క్వార్టర్లీ పరీక్షల ఫలితాలు మొదలైన అంశాల గురించి చర్చించారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థుల టెక్స్ బుక్స్, సిలబస్, మారిన క్వశ్చన్ పేపర్ విధానం గురించి విద్యార్థుల నుంచి ఫీడ్ బాక్ తీసుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె. సుచరిత, ధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

సామూహికంగా ఎలుకల నివారణ చేపట్టాలి

పొన్నూరు ఏడీఏ రామకోటేశ్వరి సూచన



ఎలుకల మందు మిశ్రమాన్ని తయారుచేసే విధానాన్ని రైతులకు వివరిస్తున్న ప్రత్తిపాడు ఏవో సుగుణభేగం

కాకుమాను: మండలంలోని రైతులందరూ తమ పంట పొలాల్లో సామూహికంగా ఎలుకల నిర్మూలన చేపట్టాలని పొన్నూరు ఏడీఏ రామకోటేశ్వరి సూచించారు. మండల వ్యాప్తంగా అన్ని రైతు సేవా కేంద్రాలలో మంగళవారం ఉచితంగా రైతులకు ఎలుకల నివారణ మందును అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 96 గ్రాముల నూకలు, 2 గ్రాములు వంట నూనె, 2 గ్రాముల బ్రోమొడయోలిన్ విష పదార్థాలను కలపి 100 గ్రాములు విషపు ఎర తయారు చేసుకోవాలని ఆమె సూచించారు. అందులో నుంచి 10 గ్రాముల చొప్పున ఎలుక బొరియల కన్నాలలో పెట్టి పూడ్చాలన్నారు. మరో ఏడీఏ సీహెచ్ తిరుమలాదేవి మాట్లాడుతూ రైతులందరూ సామూహిక ఎలుకలను నివారించినట్లయితే దిగుబడులు పెరిగే అవకాశం ఉందని ఆమె తెలిపారు.

జొన్నలగడ్డలో ...

గుంటూరు రూరల్: మండలంలోని వరి పంట వేసిన అన్ని గ్రామాలలో రైతు సేవా కేంద్రాల ఆధ్వర్యంలో సామూహిక ఎలుకల నియంత్రణ కార్యక్రమం నిర్వహించటం జరిగిందని మండల వ్యవసాయ అధికారి కిషోర్ కుమార్ తెలిపారు. మంగళవారం వ్యవసాయ సహాయ సంచాలకులు (భూసార పరీక్ష కేంద్రం, గుంటూరు) శివకుమారి ఆధ్వర్యంలో జొన్నలగడ్డ, బుడంపాడు గ్రామాల్లో సామూహిక ఎలుకల నియంత్రణ కార్యక్రమం నిర్వహించారు. జొన్నలగడ్డ గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ఎంఏవో మాట్లాడుతూ రైతులకు ఎలుకల నివారణకు అవసరమైన విషపు ఎర తయారీ విధానం వివరించారు. ప్రతి హెక్టార్‌కు సుమారు బ్రోమోడయోలిన్ 10 గ్రాములు అవసరమని, 100 గ్రాముల విషపు ఎర తయారీకి 2 గ్రాముల బ్రోమోడయోలిన్, 2 గ్రాముల నూనెను 96 గ్రాముల నూకలతో కలిపి తయారు చేయాలని సూచించారు. ఒక్కో సజీవ బొరియలో సుమారు 10 గ్రాముల చొప్పున విషపు ఎర పొట్లాలు కట్టి వేయాలని చెప్పారు. పంచాయతీ వారీగా, కాలువ గట్లు, పోరంబోకు, బీడు భూములలో ప్రతి హెక్టార్‌కు 500 గ్రాముల ఎర సరిపోతుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, వ్యవసాయ సిబ్బంది, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



కర పత్రాలను అందజేస్తున్న ఏడీఏలు, ఏఓ



అవగాహన కల్పిస్తున్న అధికారులు

వేర్వేరు గ్రామాల్లో....

ప్రత్తిపాడు: రైతులు సామూహికంగా ఎలుకల నివారణకు కృషి చేయాలని మండల వ్యవసాయాధికారి షేక్ సుగుణ భేగం అన్నారు. మండల పరిధిలోని యనమదల, వంగిపురం గ్రామాల్లో మంగళవారం ఎలుకల సామూహిక నివారణ కార్యక్రమాన్ని నిర్వహించారు. వరి పంటను సాగు చేస్తున్న రైతులకు బ్రోమోడైలిన్ ఎలుకల మందును పంపిణీ చేశారు. అనంతరం మందును నూకల్లో ఎలా కలపాలి, పంటలో ఏ విధంగా పిచికారీ చేయాలన్న అంశాలను రైతులకు ప్రయోగాత్మకంగా వివరించారు. ఈ సందర్భంగా ఏవో సుగుణ భేగం మాట్లాడుతూ ఎలుకల ధాటికి పంట నష్టం వాటిల్లకుండా చూసేందుకే సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు చెప్పారు. ఎలుకల నివారణను ఒకరిద్దరు రైతులు కాకుండా రైతుంతా సామూహికంగా చేస్తేనే సత్ఫలితాలుంటాయని ఏవో తెలిపారు. ఏఈవో వై. నీలాంబరం, ఎంపీఈవో కె. నాగరాజు, రైతులు పాల్గొన్నారు.

పొన్నూరులో...

పొన్నూరు: పంట పొలాల్లో ఎలుకల నివారణకు విషపు ఎరను వినియోగిస్తే ప్రయోజనం చేకూరుతుందని ఏడీఏలు సిహెచ్ తిరుమలాదేవి. వి. రామకోటేశ్వరి అన్నారు. మంగళవారం మండలంలోని గ్రామపంచాయతీ కార్యాలయాలు, రైతు సేవా కేంద్రాలలో ఎలుకల నివారణకు విషపు ఎర పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ ఎరను పది గ్రాముల పొట్లాలు కట్టి ఎలుక కన్నముల వద్ద ఉంచితే ఎలుకలను నియంత్రించగలరని అన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఆర్.వెంకటేశ్వరరావు, వ్యవసాయ విస్తరణాధికారి ఐ.శ్రీకాంత్, ప్రియాంక, రైతులు పాల్గొన్నారు.

ఈ-బైక్ డిజైన్ పోటీల్లో ఆర్‌వీఆర్‌జేసీ విద్యార్థుల ప్రతిభ



బహుమతులు సాధించిన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: రవాణా రంగంలో విద్యుత్ వాహనాలకు పెరుగుతున్న ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని తమ కళాశాల విద్యార్థులు రూపొందించిన ఎలక్ట్రికల్ బైక్‌కు జాతీయస్థాయిలో అవార్డులతో పాటు, నగదు బహుమతులను సాధించటం సంతోషకరమని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్ శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ మద్దినేనిలు తెలిపారు. మంగళవారం చౌడవరం గ్రామంలోని కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం మాట్లాడుతూ తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూరులోని శ్రీరామకృష్ణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో మెక్ట్రాన్ మోటర్స్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన నేషనల్ లెవల్ ఈ-బైక్ డిజైన్ ఛాలెంజ్ (సీజన్ 5.0) 2025 పోటీల్లో దేశంలోని వివిధ కళాశాలల నుంచి అనేక విద్యార్థుల బృందాలు పాల్గొనగా, తమ కళాశాల విద్యార్థులు రూపొందించిన ఈ-బైక్ ద్వితీయ స్థానంలో నిలిచి రన్నరప్ అవార్డు (రూ.10,000 నగదు బహుమతి) గెలుచుకుందన్నారు. అదేవిధంగా బెస్ట్ హోల్ క్లింబ్ (6.1 స్పీడ్) అవార్డు (రూ.5,000 నగదు బహుమతి), బెస్ట్ బంప్ టెస్ట్ అవార్డు (రూ.5,000 నగదు బహుమతి), బెస్ట్ రన్నర్ డ్రాగ్ రేస్ అవార్డు, బెస్ట్ రన్నర్ ఆటో క్రాస్ వంటి నాలుగు ప్రత్యేక విభాగాల్లో కూడా ప్రత్యేక అవార్డులను గెలుచుకున్నారన్నారు. పర్యావరణ కాలుష్యాన్ని నివారించేందుకు భవిష్యత్తులో రవాణా రంగం అంతా విద్యుత్ వాహనాల వినియోగ దిశగా మార్పు జరగనున్నదని, పోటీల్లో పాల్గొని బహుమతులు సాధించిన విద్యార్థులను కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ డాక్టర్ ఆర్.గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్‌లు అభినందించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.శ్రీనివాస్ మాట్లాడుతూ కళాశాల అధ్యాపక నిపుణుల నేతృత్వంలో ఈ-బైక్ వాహన తయారీలో ఎలక్ట్రికల్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగం నుంచి మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం నుంచి 26 మంది విద్యార్థులతో కూడిన జట్టు పాల్గొన్నారన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, డాక్టర్ కె.స్వర్ణశ్రీ, పీ వెంకటమహేష్, ఆర్ మారుతీ ప్రసాద్ తదితరులు బహుమతులు సాధించిన విద్యార్థులను అభినందించారు.

సిబార్‌లో దంత వైద్య వైజ్ఞానిక ప్రదర్శన

- దంత వైద్య చికిత్స పద్ధతులపై ప్రజలకు అవగాహన
- ఉచితంగా అన్ని రకాల దంత వైద్య చికిత్సలు



మాట్లాడుతున్న డాక్టర్ ఎల్ కృష్ణ ప్రసాద్

పెదకాకాని: సిబార్ దంత వైద్య కళాశాల రజతోత్సవాలను పురస్కరించుకొని ఈనెల 9 నుంచి 15 వ తేదీ వరకు ప్రజలు, విద్యార్థులకు దంత వ్యాధులపై అవగాహన కల్పించేందుకు దంత వైద్య వైజ్ఞానిక ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నట్లు కళాశాల డీన్ డాక్టర్ లింగమనేని కృష్ణప్రసాద్ తెలిపారు. మండల పరిధిలోని సిబార్ దంత వైద్య కళాశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డాక్టర్ ఎల్.కృష్ణప్రసాద్ మాట్లాడుతూ వారం రోజుల పాటు జరిగే ఈ ప్రదర్శనలో దంత వ్యాధుల నిర్ధారణ, నియంత్రణ, చికిత్సా పద్ధతులపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. దంత వైద్య సమస్యలు, అధునాతన చికిత్సా విధానాలైన ఇంప్లాంట్స్, రూట్ కెనాల్ ట్రీట్మెంట్, కాస్మెటిక్ డెంటిస్ట్రీ, లేజర్ ట్రీట్మెంట్ వంటి వాటిపై అవగాహన కల్పించబడుతుందన్నారు. వీటితో పాటుగా పొగాకు వల్ల కలిగే అనర్థాలు, నోటి కేన్సర్, నివారణ పద్ధతులపై వివరించడం జరుగుతుందన్నారు. నోటి ఆరోగ్యం కాపాడుకోవడం కోసం చేయవలసిన సరైన బ్రషింగ్ పద్ధతుల గురించి సందర్శకులకు అవగాహన కోసం నమూనాలపై ప్రదర్శిస్తారన్నారు. దంత వ్యాధుల వైద్యానికి సంబంధించిన వివిధ సందేహాలను ప్రత్యేక స్పెషలిస్టులు నివృత్తి చేస్తారన్నారు. ఈ ప్రదర్శనను సందర్శించే ప్రజలకు కాస్మెటిక్ చికిత్సలు మినహా మిగతా అన్ని రకాల దంత వైద్య చికిత్సలు ఉచితంగా అందించబడుతుందన్నారు. ఈ సదవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ కృష్ణ ప్రసాద్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ తోట కృష్ణమోహన్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రమణారెడ్డి, పబ్లిక్ హెల్త్ డెంటిస్ట్రీ విభాగాధిపతి డాక్టర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వైద్యుల డిమాండ్లు పరిష్కరించాలి

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బి. లక్ష్మణరావు



మాట్లాడుతున్న బి. లక్ష్మణరావు

ప్రత్తిపాడు: వైద్యుల డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బి. లక్ష్మణరావు అన్నారు. తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలంటూ వైద్యులు చేస్తున్న సమ్మెకు మద్దతుగా ప్రత్తిపాడు మండలం పెదగొట్టిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. పీహెచ్‌సీల వైద్యులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలంటూ జిల్లా అధ్యక్షుడు లక్ష్మణరావు ఆశా కార్యకర్తలతో కలిసి పెద్దపెట్టున నినాదాలు చేశారు. ఇప్పటికే వైద్యులకు, అధికారులకు మధ్య జరిగిన చర్చలు విఫలం కావడంతో ఈ నెల 5వ తేదీ నుంచి వైద్యులు విజయవాడలో రిలే నిరాహార దీక్షలు నిర్వహిస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి చొరవ చూపి వైద్యుల సమస్యకు పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పని చేస్తున్న డాక్టర్స్‌కు జీఓ నంబర్ 99 ద్వారా కోతవిధించిన ఇన్ సర్వీస్లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోటాను పునరుద్ధరించడంతో పాటు వారు కోరుతున్న న్యాయమైన డిమాండ్లన్నీ పరిష్కరించాలన్నారు.

ఆశా వర్కర్ల వేతనాలు పెంచాలి

ఆశా వర్కర్లుకు కనీస వేతనాలు చెల్లించి వారి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో చేసిన నిరసన కార్యక్రమంలో లక్ష్మణావు మాట్లాడుతూ ఆశాలకు గత ఆరేళ్లుగా వేతనాలు పెంచలేదని, పని భారం రోజురోజుకీ పెరుగుతుందన్నారు. ఆశ వర్కర్లను ప్రభుత్వ కార్మికులుగా గుర్తించాలని, చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించి పెన్షన్ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఆశ కార్యకర్తలు జ్యోతి, పద్మ, విమల, సురేఖ, యేసు మరియమ్మ, ప్రేమ కుమారి తదితరులు పాల్గొన్నారు.

యనమదలలో ఇరువర్గాల ఘర్షణ

- రాళ్లు రువ్వుకుని, కొట్లాడుకున్న గ్రామంలోని రెండు వర్గాలు
- జూనియర్ ఎన్టీఆర్ ఫొటోను బోడిగుండుగా మార్ఫింగ్ చేయడంతో తలెత్తిన వివాదం


ప్రత్తిపాడు: ఓ ఆకతాయి జూనియర్ ఎన్టీఆర్ ఫొటోను బోడిగుండుగా మార్ఫింగ్ చేయడంతో తలెత్తిన వివాదం రెండు వర్గాల మధ్య కొట్లాటకు దారితీసిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. వివరాల్లోనికి వెళితే.. గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం యనమదలలో ఇటీవల కొందరు జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు అభివాదం చేస్తున్నట్లుగా ఉన్న జూనియర్ ఎన్టీఆర్ ఫొటోతో గ్రామంలోని ఓ సెంటరులో ఫ్లెక్సీని ఏర్పాటు చేసుకున్నారు. అదే గ్రామానికి చెందిన ఓ ఆకతాయి ఆ ఫ్లెక్సీని ఫొటో తీసి, ఆ ఫొటోను మార్ఫింగ్ చేశాడు. జూనియర్ ఎన్టీఆర్ తలపై ఉన్న జుట్టును తీసేసి బోడిగుండుగా మార్ఫింగ్ చేసిన ఫొటోను, మార్ఫింగ్ చేయకముందు ఓ ఫొటోను అభ్యంతరకర పదజాలంతో సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశాడు. దీంతో ఈ విషయమై స్థానికంగా వివాదం మొదలైంది. ఇరు వర్గాలకు చెందిన వారు జోక్యం చేసుకుని సమస్యను పెద్దదికాకుండా చేసేందుకు రాజీ ప్రయత్నాలు చేశారు. అయినా అవి పూర్తిస్థాయిలో ఫలించలేదు. సోమవారం రాత్రి ఇరు ర్గాలు బాహాబాహీకి దిగాయి. ఇరువర్గాలకు చెందిన సుమారు యాభై మంది గుమిగూడి ఒకరిపై ఒకరు పిడిగుద్దులు కురిపించుకుంటూ కొట్లాటకుగారు. అంతటితో ఆగకుండా రాళ్లు రువ్వుకున్నారు. ఆ రాళ్లు పక్కనున్న ఇళ్లలోనికి పడటంతో ప్రజలు బెంబేలెత్తిపోయారు. ఇరు వర్గాల ఘర్షణతో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు తలెత్తడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాలను పంపించివేశారు. మంగళవారం ఇరువర్గాలు పోలీస్‌స్టేషనుకు చేరుకున్నాయి.

భార్యపై కోపంతో స్కూటీకి నిప్పుపెట్టాడు

పెదకాకాని: భార్యపై ఉన్న కోపంతో భర్త స్కూటీకి నిప్పు అంటించిన సంఘటన పెదకాకాని పోలీసుస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం నల్లపాడు గ్రామానికి చెందిన చంద్రశేఖర్‌కు మండలంలోని ఎన్‌టిఆర్‌కాలనీకి చెందిన చంద్రికతో 2007 సంవత్సరములో వివాహమైంది. గత కొంతకాలంగా భార్యపై అనుమానంతో చంద్రశేఖర్ తరచూ గొడవ పడుతున్నాడు. గత ఆరు నెలల కిందట చంద్రిక పుట్టింటికి వచ్చింది. ఈనెల 4వ తేదీన భార్య వద్దకు వచ్చిన భర్త చంద్రశేఖర్ ఎప్పటి మాదిరిగానే గొడవ పెట్టుకున్నాడు. ఇరువురి మధ్య వాగ్వివాదం చోటు చేసుకోవడంతో చంద్రశేఖర్ అత్తవారింట్లో ఉన్న స్కూటీకి నిప్పు పెట్టాడు. స్థానికులు మంటలు ఆర్పివేశారు.

ఘన వ్యర్థాలతో సంపద సృష్టి

జిల్లా పంచాయతీ అధికారి వీవీఎస్ సాయికుమార్



చేబ్రోలు: గ్రామాలలో క్షేత్ర స్థాయిలో ఇంటింటి ఘన వ్యర్థాల సేకరణ ద్వారా సంపద సృష్టించటంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా పంచాయతీ అధికారి వీవీఎస్ సాయికుమార్ అన్నారు. మండల కేంద్రమైన చేబ్రోలులోని చెత్త సంపద కేంద్రంలో మంగళవారం మాస్టర్స్ ట్రైనర్స్‌కు శిక్షణా కార్యక్రమం జరిగింది. గ్రామ పంచాయతీలలో ఘన వ్యర్థాల నిర్వహణ పరిశుభ్రత పచ్చదనంపై పంచాయతీ కార్యదర్శులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమంలో జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసిన ఈ శిక్షణలో 16 మండలాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులకు మాస్టర్ ట్రైనర్స్‌గా శిక్షణ అందించారు. డీపీవో సాయికుమార్ మాట్లాడుతూ సంపద సృష్టిలో పారిశుద్ధ్య కార్మికుల వినియోగం, వారి హక్కులు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అర్హత తదితర అంశాల గురించి వివరించారు. కార్యక్రమంలో బాపట్ల ఈటీసీ ఫ్యాకల్టీ కే లలిత, ఎంపీడీవో టి ఊహారాణి, డిప్యూటీ ఎంపీడీవో ఎం రవిశంకర్, అనూరాధ, జి ప్రసాద్, మాస్టర్ ట్రైనర్స్ పాల్గొన్నారు.

ప్రజల నుంచి ఫిర్యాదులు అందితే చర్యలు

జిల్లా కలెక్టర్ తమిమ్ అన్సారియా



సిబ్బందికి సూచనలు చేస్తున్న కలెక్టర్

పొన్నూరు: ప్రజారోగ్యాన్ని పరిరక్షించాల్సిన వైద్యశాలలో పారిశుద్ధ్య నివారణ చర్యలు తప్పక చేయించాలని చేపట్టాలని జిల్లా కలెక్టర్ తమిమ్ అన్సరియా వైద్యులను ఆదేశించారు. మంగళవారం నిడుబ్రోలు సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్యశాలలో పలు సమస్యలను గుర్తించారు. ప్రజలకు 108 సేవలు అందడం లేదని సిబ్బంది ద్వారా తెలుసుకున్నారు. వైద్యశాలలో పరిసరాలు మురుగు నీటితో నిండి అధ్వానంగా ఉండడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రసూతి వైద్య సేవలను పెంచాలని డాక్టర్ ఫిరోజ్ ఖాన్‌కు సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా పారిశుద్ధ్య సిబ్బందిని కేటాయించాలన్నారు. ప్రజల నుంచి ఫిర్యాదులు రాకుండా బాధ్యతగా విధులు నిర్వహించాలని సూచించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేలా విధులు నిర్వహించాలన్నారు.

ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి



వెనిగండ్లలో వినతిపత్రం అందజేస్తున్న ఆశావర్కర్లు

కాకుమాను: చాలీచాలని జీతాలతో అనేక సమస్యలు ఎదుర్కొంటున్న ఆశ వర్కర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆ సంఘ జిల్లా గౌరవ అధ్యక్షురాలు జి. రమణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం పెదనందిపాడు పీహెచ్‌సీ కార్యాలయం వద్ద ఆశ వర్కర్లు చేపట్టిన ధర్నాలో రమణ పాల్గొని మాట్లాడుతూ ఆశ డే సందర్భంగా మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా ఆశాల సమస్యలు పరిష్కరించాలని ధర్నా నిర్వహిస్తున్నట్లు రమణ తెలిపారు. ఆశాలకు కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని ఆమె డిమాండ్ చేశారు. తోటి ఉద్యోగులతో పాటు ఆశాలకు కూడా అన్ని సెలవులు ఇవ్వాలని, జాతీయ సెలవులు, పండుగ సెలవులు, వారాంతపు సెలవులు, క్యాజువల్ సెలవులు, మెడికల్ లీవ్‌లు ఇవ్వాలని ఆమె కోరారు. కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశా వర్కర్‌లుగా మార్పు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ డాక్టర్ ప్రియంవదకు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల నాయకులు దొప్పలపూడి రమేష్‌బాబు, సరిత, సర్వాదేవి, మేరీ, మణి, రత్నకుమారి, రాణి, త్రివేణి, జ్యోతి, విజయ, సౌజన్య, తదితరులు పాల్గొన్నారు.

పెదకాకానిలో....

పెదకాకాని: ప్రభుత్వం ఆశ వర్కర్లకు కనీస వేతనం ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి వై నేతాజీ అన్నారు. పెదకాకానిలో మంగళవారం ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఆశా కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి వై నేతాజీ మాట్లాడుతూ ఆశ వర్కర్లకు పెరిగిన ధరలకు అనుకూలంగా కనీస వేతనం ఇవ్వాలని, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశా వర్కర్లుగా మార్పు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అప్పటివరకు ఆశలతో సమానంగా అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని, అన్ని రకాల సెలవులు జాతీయ సెలవులు పండగ సెలవులు, వారాంతపు సెలవలు, క్యాజువల్ లీవులు, మెడికల్ లీవులు ఇవ్వాలన్నారు. ధర్నా అనంతరం పెదకాకాని. వెనిగండ్ల మెడికల్ ఆఫీసర్లకు మెమోరాండం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు కె.కుమారి, టి రాధిక, టి సీతారామకుసుమ, ఎం.ఇందిరా, షేక్ మరింబి, ఎస్ జ్యోతి, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

ఎంఈఓ కెన్నడీ



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంఈఓ కెన్నడీ

కాకుమాను: నేటి పోటీ ప్రపంచంలో విద్యతో పాటు క్రీడలు ఎంతో ప్రాముఖ్యమైనవని ప్రతి విద్యార్థి విద్యార్థి దశ నుంచే క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని ఎంఈఓ కె.ఎఫ్. కెన్నడీ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్.జీ.ఎఫ్. ఆధ్వర్యంలో మంగళవారం మండల స్థాయి క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కెన్నడీ మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడలలో రాణించాలని ఆయన సూచించారు. ప్రముఖ క్రీడాకారులను స్మరించుకుంటూ వారిని ఆదర్శంగా తీసుకుని క్రీడలలో రాణించాలని ఆయన తెలిపారు.

ఈ సందర్భంగా విద్యార్థులకు వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, చెస్, అథ్లెటిక్స్ క్రీడా పోటీలను నిర్వహించారు. మండలంలోని కొమ్మూరు, బోడిపాలెం, కొండపాటూరు, రేటూరు, గరికపాడు, ఏ.పీ.ఎస్. డబ్ల్యూ ఆయా పాఠశాలలోని విద్యార్థులకు పోటీలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో హెచ్ఎం జీ.వీ.బి. వెంకట్రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థికి గణిత శాస్త్రంతో మేధో వికాసం

గణిత శాస్త్ర బోధకుడు డాక్టర్ బి.సాయికిరణ్



మాట్లాడుతున్న సాయి కిరణ్

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థి దశలో గణితశాస్త్రంపై ఆసక్తి కనబర్చే విద్యార్థులు మిగతా అన్ని సబ్జెక్టుల్లో చురుగ్గా ఉంటూ మేధాశక్తిని కనబరుస్తారని ప్రముఖ గణిత శాస్త్ర బోధకుడు డాక్టర్ బి. సాయికిరణ్ పేర్కొన్నారు. నగరంపాలెంలో ప్రజ్ఞ పాఠశాలలో మంగళవారం 'వేదిక్ మ్యాథ్స్, మెమరీ టెక్నాలజీ, మైండ్ పవర్, మిడ్ బ్రెయిన్ యాక్టివేషన్'అంశాలపై ఐదు సార్లు గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్, రెండుసార్లు నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సాధించిన మ్యాథ్స్ మెజీషియన్ డాక్టర్ సాయికిరణ్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు తీసుకున్నారు.

ఈ సందర్భంగా డాక్టర్ సాయికిరణ్ మాట్లాడుతూ వేదాలు ప్రపంచ భాషలకు పునాది అయితే వేద గణితం అన్ని శాస్త్రాలకు తల్లి వంటిదన్నారు. ఏ సబ్జెక్టులోనైనా ప్రామాణికాలు అంకెలు లేకుండా ఉండవన్నారు. వేదిక్ మ్యాథమెటిక్స్ నేర్చుకోవటం చాలా సులువని, వాటిపై పట్టు సాధించడం ద్వారా మిగతా అన్ని విషయాలలో మేధావులుగా రాణిస్తారని వివరించారు. పాఠశాల కరస్పాండెంట్ నాయుడు చక్రనాగ్ మాట్లాడుతూ మెరుగైన సాధారణ విద్యా బోధనతో పాటు విద్యార్థుల సమగ్ర వికాసానికి కావలసిన అన్ని రకాల శిక్షణలు అందిస్తున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాయుడు కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు సుధారాణి, షేక్ సలీం, రవి, షేక్ సుభాని తదితరులు పాల్గొన్నారు.

పెదకాకానిలో గుర్తు తెలియని వ్యక్తి మృతి



పెదకాకాని: గుర్తు తెలియని వ్యక్తి చికిత్స పొందు తూ మృతి చెందిన సంఘటన పెదకాకానిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం పెదకాకాని శివారు ప్రాంతంలోని గోల్డెన్ బార్ రెస్టారెంట్ సమీపంలో ఒక వ్యక్తి అపస్మారకస్థితిలో పడి ఉన్నట్లు ఈనెల 5వ తేదీన స్థానికులు 108 వాహనానికి సమాచారం ఇచ్చారు. అక్కడికి చేరుకున్న అంబులెన్స్ సిబ్బంది బాధితుడిని గుంటూరు ప్రభుత్వ ఆసు పత్రికి తరలించారు. సుమా రు 40 సంవత్సరాలు వయ స్సు కలిగిన ఆ వ్యక్తి చికిత్స పొందుతూ మరణించాడు. మృతుని వద్ద ఎటువంటి ఆధారాలు లభ్యం కాలేదు. పురుగుమందు సేవించి ఉంటాడని భావిస్తున్నారు. వీఆర్వో కృష్ణ కిషోర్ ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

యువకుడిపై కేసు

లక్ష్మీపురం: ఓ యువకుడు మరో యువకుడిని డబ్బు కావాలని అడుగగా వారి ఇరువురి మధ్య వాగ్వివాదం చోటు చేసుకోవడంతో స్నేహితుడి పెదవి కొరికి దాడి చేసి గాయపరిచిన ఘటన పై నగరం పాలెం పోలీసులు మంగళవారం రాత్రి కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం శ్రీనివాసరావుపేటకు చెందిన పవన్ కళ్యాణ్ అనే యువకుడు విద్యుత్ శాఖలో ఔట్ సోర్సింగ్‌లో విధులు నిర్వహించే చక్రవర్తి ఇద్దరు స్నేహితులు. అయితే పవన్ కళ్యాణ్, చక్రవర్తికి ఫోన్ చేసి రూ.4 వేలు డబ్బులు కావాలని అడుగగా చక్రవర్తి, పవన్ కళ్యాన్ వద్దకు వెళ్లి డబ్బులు గురించి మాట్లాడే నేపథ్యంలో వాగ్వివాదం చోటు చేసుకుంది.